# చట్టాలు ఉన్నా
# గిరిజనులు భూమి కోల్పోయారు....

**[ఇటీవల హైదరాబాద్‌లోని ఎస్.ఐ.ఆర్.డి. సంస్థలో భూ సంస్కరణల గురించి జరిగిన ఒక గోష్టిలో గిరిజన ప్రాంతాల్లో ఈ సంస్కరణలు ఎలా అమలు జరిగాయో ఐ.డి.టి.ఎ. ప్రాజెక్ట్ అధికారి శ్రీ ఎస్. కె. ప్రసాద్, ఐ.ఎ.ఎస్. సమర్పించిన పత్రానికిది సంక్షిప్త స్వేచ్ఛానువాదం ఇది తన వ్యక్తిగత హోదాలో సమర్పించిన పత్రమని ఆయన స్పష్టం చేశారు. శ్రీ ప్రసాద్ రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా పని చేశారు.]**

గిరిజనులు పోడు వ్యవసాయాన్ని వదలిపెట్టి మామూలు వ్యవసాయానికి అలవాటు పడ్డారు. వరంగల్ జిల్లాలో పోడు వ్యవసాయం అంతర్ధానమైంది. తూర్పు గోదావరి జిల్లా కోయవారు కూడా పోడు వ్యవసాయాన్ని వదలి పెట్టారు. కొండరెడ్లు ఇంకా పోడు వ్యవసాయం చేస్తున్నా, వారు కూడా ప్రధాన స్రవంతిలోకి వస్తున్నారు. మొత్తం మీద వ్యవసాయం వారి జీవనాధారం. వరంగల్ జిల్లా ఏటూరునాగారం, తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం ప్రాంతాల్లో భూ సంస్కరణల అమలు గురించిన నా అనుభవాలను మీ ముందుంచుతున్నాను.

గిరిజన భూములు ప్రధానంగా రెండు రకాలు. **1.** పట్టాలున్న భూములు, **2.** పట్టాలు లేకపోయినా చాలా కాలంగా గిరిజనుల సాగులో ఉన్న ప్రభుత్వ భూములు, లేక ఇటీవల డి.పట్టా పొందిన భూములు. గిరిజనుల హక్కులను రక్షించే చట్టాలు ఎలా అమలు జరిగాయో పరిశీలిద్దాం.

భూమిమీద వారి హక్కులను సంరక్షించే చట్టాలు బ్రిటీష్ పాలనలోనూ ఉన్నాయి. అయితే స్వతంత్రం వచ్చిన తర్వాత 1959 లో ఎ. పి. షెడ్యూల్ ప్రాంతాల లాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ అమలులోకి వచ్చింది. 1963 లో ఇది తెలంగాణా ప్రాంతానికి వర్తింప జేశారు. ఈ చట్టం క్రింద ప్రభుత్వం అనుమతిస్తే తప్ప గిరిజనుల చేతుల్లోనుంచి గిరిజనేతరుల చేతుల్లోకి భూమి మార్పిడి నిషేధం. గిరిజనుడికి గిరిజనుడికి మధ్య మార్పు అనుమతించ బడింది. అయితే గిరిజనేతరుని చేతుల్లోకి మార్పిడిని ఈ చట్టం పూర్తిగా నిషేధించలేదు, కొన్ని పరిమితులు మాత్రం విధించింది. అంతేకాక గిరిజనేతరుల నుంచి గిరిజనేతరులకు మార్పిడిని కూడా నిషేధించ లేదు. అంతేగాక గిరిజనుడు ఈ భూమి నాది అని తన అధికారాన్ని రుజువు చేసుకోవడంలో సమస్యలు ఎదురయ్యాయి. అందువల్ల 1970 లో ఈ రెగ్యులేషన్‌ను సవరించి ఏజెన్సీ ప్రాంతాల్లో ఎవరెవరి మధ్య అయినాసరే భూమి చేతులు మారడాన్ని పూర్తిగా నిషేధించారు. అయితే గిరిజనులకు లేక గిరిజన సొసైటీలకు మార్పిడిని మాత్రం నిషేధం నుంచి మినహాయించింది. ఈ చట్టంలో ఇంకా ఇతర విషయాలు కూడా ఉన్నాయి. 1978లో మరో రెగ్యులేషన్ ద్వారా ఈ చట్టాలకు వ్యతిరేకంగా స్థిరాస్తి కలిగి ఉండటాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించారు.

రంపచోడవరం ఏజెన్సీలో 550 గ్రామా లున్నాయి. 1963 లో భూమి మార్పిడి రెగ్యులేషన్ ఆమోదించిన తర్వాత, దాన్ని అమలు చేయడంలో చట్టపరమైన ఇబ్బందులు ఏమీ ఎదుర్కోలేదు. అయినా పెద్ద ఎత్తున భూములు గిరిజనేతరుల చేతుల్లోకి పోయాయి. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం 1,33,585 హెక్టార్ల ప్రైవేట్ భూమిలో 28,457 హెక్టార్లు గిరిజనుల చేతుల్లోకి మారింది. అందులో 20 వేల ఎకరాల వివాదాస్పదమైనది. అలాగే 64,487 హెక్టార్ల ప్రభుత్వ భూమిలో 21,816 హెక్టార్లు గిరిజనేతరుల చేతిలోకి మారాయి. వరంగల్ గిరిజన ప్రాంతంలో 40,110 హెక్టార్ల పట్టా భూముల్లో 11,350 హెక్టార్లు గిరిజనేతరుల చేతుల్లో ఉన్నాయి. బదలాయింపు నిషేధం అమలులో ఉన్నా ఈ మార్పిడులు ఎలా జరిగాయి?

**1917** నుంచి బదలాయింపు చట్టం అమలులో ఉన్నా గిరిజనేతరులు గిరిజనుల నుంచి భూమి కొనుక్కోవడానికి ప్రభుత్వ ఏజెంట్ అనుమతించారు. అలాగే చట్టం అమలులో ఉన్నా కొండ కోయలను గిరిజనులుగా నోటిఫై చేయలేదు. ఆ తర్వాత **1959** లో కొత్త రెగ్యులేషన్‌ను ఆమోదించినా, పది సంవత్సరాల తర్వాతే ఆ చట్టం క్రింద రూల్స్ తయారు చేశారు. అందుచేత ఆ పది సంవత్సరాల కాలంలో గిరిజనుల హక్కులకు పెద్ద ఎత్తున హాని జరిగింది. ఆ తరువాత రెగ్యులేషన్‌ను అమలు చేయడం ప్రారంభించిన తర్వాత రంపచోడ వరం ఏజెన్సీలో **5,648** కేసులు, వరంగల్ జిల్లాలో **5,338** కేసులు అక్రమ బదలాయింపులుగా అధికారులు కనుగొన్నారు. అయితే విచారణ సందర్భంలో అత్యధిక సంఖ్యలో కేసులను లాంఛనంగా మాత్రమే చూసి, కొన్ని సందర్భా లలో వివరాల్లోకి పోకుండానే కేసులు గిరిజనేతరులకు అనుకూలంగా కొట్టివేశారు. అందుచేతనే గిరిజనులు పదే పదే విజ్ఞప్తులు, అవే భూముల గురించి చేసుకుంటూ వచ్చారు.

చట్టం అయితే పకడ్బందీగానే ఉంది. అయినా బదలాయింపులు జరిగి పోయాయి. దీనికి కారణాలు :

**1.** భూమి గిరిజనేతరుని స్వాధీనంలోనే ఉన్నా, భూమి బినామీ గిరిజనుడి పేరులోనే నమోదైంది. కొన్ని సందర్భాల్లో గిరిజనేతరుడు ఉంచుకున్న గిరిజన స్త్రీ పేరున నమోదయ్యాయి.

**2.** రెవిన్యూ అధికారులతో కుమ్మక్కై, బోగస్ గిరిజన సర్టిఫికెట్లు సంపా దించిన గిరిజనేతరులు భూమిపై హక్కు సంపాదించారు. తూర్పు గోదావరిలో అలాంటి **375** బోగస్ సర్టిఫికెట్లను తర్వాత రద్దు చేశారు.

**3.** ఆ గ్రామం లేక ప్రాంతం గిరిజన ప్రాంతం కానేకాదని నిర్ణయాలు చేసి గిరిజనేతరులు చట్టపరిధి నుంచి తప్పించుకున్నారు.

**4.** అమ్మినవాడు గిరిజనుడే అయినా వాడు గిరిజనేతరుడని నమ్మించడానికి కూడా ప్రయత్నాలు జరిగాయి.

**5.** కోర్టు కేసుల్లో గిరిజనులను ఇరికించడం గిరిజనేతరులు చేసిన విజయవంతమైన ప్రయత్నం. ముందు స్టే సంపాదింస్తారు. తర్వాత శాంతి భద్రతల పరిస్థితి బాగుండకపోవడం వల్ల కోర్టుకు రాలేకపోతున్నామని, మంచి లాయర్లు రావడానికి భయపడుతున్నారని వంకలు పెట్టేవారు. విచారణలు మండల స్థాయిలో జరగడం వల్ల గిరిజనులు మాటిమాటికి మండల కేంద్రానికి రాలేకపోయేవారు, క్రింది కోర్టు నిర్ణయంపై అపీలు చేయడానికి ఒక పద్ధతిని చట్టం నిర్దేశించినా, గిరిజనేతరులు నేరుగా హైకోర్టుకు వెళ్లేవారు.

**6.** ఇంత తతంగం జరిగిన తర్వాత గిరిజనుడికి భూమిని తిరిగి ఇచ్చివేయాలని తీర్పు ఇచ్చినా, ఆ తీర్పు కాగితం మీదనే ఉండిపోయింది. ఒకవేళ భూమిని దఖలు పరచినా, అనేక మాయోపాయాల ద్వారా గిరిజనేతరుడు భూమిని తిరిగి తన వశం చేసుకున్నాడు. స్థిరాస్తిని కలిగి ఉండడం చట్టరీత్యా నిషిద్ధమైనా, అనేక కేసులు పెట్టినా, శిక్షలు వేసిన దాఖలాలు లేవు.

**1969, 1979** సంవత్సరాల్లో రెగ్యులేషన్లు చట్టస్వరూపం తీసుకుని సర్వే, సెటిల్‌మెంట్ ప్రారంభించినా, క్రింది స్థాయి ఉద్యోగుల తోడ్పాటుతో ఎన్నో అక్రమాలకు గిరిజనేతరులు పాల్పడ్డారు. ఈ చట్టాలు అమలులోకి రాకపూర్వం ఎనిమిది సంవత్సరాలు తమ వద్దనే భూమి ఉందని గిరిజనేతరులు రుజువు చేసుకోవడానికి దొంగ రసీదులు సృష్టించారు. పోలీసులను మచ్చిక చేసుకుని దాడులు చేయించి గిరిజనులను వెళ్లగొట్టి ఆ భూములు తమ పేర రిజిష్టర్ చేయించుకున్నారు. బాగా టేకు చెట్లు పెరిగిన అటవీ ప్రాంతాలు, అంతవరకూ ఎవరి ఆక్రమణలో లేకపోయినా, వాటిని కూడా తమ పేర నమోదు చేయించుకో గలిగారు. గిరిజనుల అజ్ఞానం, అమాయకత్వం వారికి శాపంగా పరిణమించాయి. వారి ఫిర్యాదులను సరిగ్గా పరిశీలించడమే జరగలేదు. తమ భూములమీద ఇతరులకు పట్టాలు లభించాయని తెలిసేసరికే చాలా ఆలస్యమైపోయేది. ఈ అక్రమాల ఫలితంగా తూర్పు గోదావరి ఏజెన్సీ ప్రాంతంలోనే గిరిజనేతరుల చేతుల్లో భూమి **1969** ముందు **9,805** హెక్టార్లుండగా, అది **16,789** హెక్టార్లకు పెరిగింది.

ఈ కేసులను విచారించే అధికారం జిల్లా కలెక్టర్లకు బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ఆదేశాలు జారీ చేసింది. కాని 1970 రెగ్యులేషన్ క్రింద అధికారం ఇంకా బదిలీ చేయాల్సి ఉంది.

గిరిజనులు ప్రభుత్వ భూములను పెద్ద ఎత్తున సేద్యం చేసుకొంటున్నారని పైన చెప్పాను. ఆ భూములకు పట్టాలు ఇవ్వటానికి ప్రభుత్వం సర్వే దళాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూముల మీద గిరిజనేతరులకు పట్టా లివ్వటాన్ని నిషేధిస్తూ, గిరిజనులకు మాత్రమే పట్టా లివ్వాలని ప్రభుత్వం 1969 లో ఆదేశించింది. అయితే 1971 లో మరో ఆదేశం జారీ చేస్తూ అంతకు 10 సంవత్సరాల ముందు నుంచీ భూమిలేని గిరిజనేతర శివాయిజమాదార్ల ఆక్రమణలో ఉన్నట్లయితే, వారిని భూములనుంచి తొలగించరాదని, గిరిజనులకు అదే గ్రామంలో గాని, ప్రక్క గ్రామంలో గాని భూముల పట్టా లివ్వాలని ఈ ఆదేశం సారాంశం. నిషేధాన్ని ఇంకా ఇంకా సడలిస్తూ మరో రెండు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంత వరకూ తూర్పు గోదావరిలో 1963లో 8 హెక్టార్లు, వరంగల్ షెడ్యూలు ప్రాంతంలో 1098 హెక్టార్లకు పట్టా లిచ్చారు. వరంగల్లు ప్రాంతంలో తక్కువ భూమి మీద పట్టా లివ్వటానికి కారణం అటవీ ప్రాంతం సరిహద్దులు నిర్ణయించక పోవటమే. గిరిజన ఉప ప్రణాళిక ప్రాంతంలో సుమారు 40 వేల ఎకరా లున్నదని అంచనా వేయగా, అందులో 25 వేల ఎకరాలను సర్వే చేయటం, ఆ భూమిలో 13,856 ఎకరాలు గిరిజనుల స్వాధీనంలో ఉందని గుర్తించారు. కాని పట్టాలు ఇచ్చింది కేవలం 2,748 ఎకరాలకు మాత్రమే అటవీ సరిహద్దుల నిర్ణయం జరక్క పోవటమే దీనికి కారణం.

ఇటు తూర్పు గోదావరి జిల్లాలో సగటున గిరిజన కుటుంబానికి 10 ఎకరాలులు, వరంగల్లులో ఆరున్నర ఎకరాలు ఉన్నాయి. కాని, (1) గిరిజనుల భూములు నగటు పంట భూములు, చాలా భాగంలో సేద్యమే లేదు. (2) మంచి పంట పండే భూములు గిరిజనేతరుల చేతుల్లో ఉన్నాయి. ఇవి మైదాన ప్రాంతాల్లో ఉన్నాయి. నీటి సదుపాయం కూడా ఉంది. ఈ భూము

లన్నీ ఒకప్పుడు మావే కదా, ఇపుడు వాళ్ళనుభవిస్తున్నారనే భావం, బాధ గిరిజనుల మనసుల్లో ఉండటమే భూమి గురించిన వివాదాలకు మూలకారణం. ఉదాహరణకు వరంగల్లు జిల్లా గోవిందరావుపేట, చలవాయి గ్రామాల్లో కృష్ణా, గుంటూరు ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనేతరులు లక్నవరం చెరువు క్రింద రెండు పంటలు పండిస్తుండగా, గిరిజనులు ఎక్కడో లోలోపలి ప్రాంతాల్లో అడవుల్లోకి నెట్టి వేయబడ్డారు.

## భవిష్యత కార్యాచరణ :

1. గిరిజనుల స్వాధీనంలో ఉండి వారు సేద్యం చేసుకొంటున్న ప్రభుత్వ భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలి. ఇది జరగాలంటే అటవీ సరిహద్దులను వెంటనే నిర్ణయించాలి.

2. గిరిజనుల భూమి గిరిజనేతరులకు బదలాయింపు ఇంకా కొనసాగించటాన్ని ఆపు చేయాలి. ఇది జరగాలంటే రెవిన్యూ అధికారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. గిరిజనులు కూడా తమ భూమిని తాత్కాలికంగానైనా బదలాయింపు జరగకుండా చూసుకోవాలి.

3. అయిదెకరాలకు పైగా గిరిజనేతరుల చేతుల్లో ఉన్న కేసులను అధికారులు ముందు గుర్తించి, వాటి మీద దృష్టి కేంద్రీకరించాలి. ఎకరం. అర ఎకరం కేసులు ఎక్కువగా తీసుకోవటం వల్ల, పెద్ద భూ ఖండాల మీద కబ్జాచేసిన గిరిజనేతరులు పేద గిరిజనేతరులను కూడగట్టి. రాజకీయంగా పలుకుబడి ప్రదర్శించి ఒత్తిడి తీసుకొని వచ్చి, బదలాయింపులను సమర్ధించుకోవటానికి అవకాశం ఏర్పడుతుంది.

**4.** ఈ వ్యవహారాలను రాజ్యాంగ చట్టం తొమ్మిదవ షెడ్యూలు క్రిందకు తీసుకొని వచ్చి, గిరిజనులకు రక్షణ కల్పించాలి. సెటిల్‌మెంట్ అధికారాలు కలెక్టర్లకు ఇవ్వాలి.

ఇవి చేయగలిగితే గిరిజనులకు రక్షణ కల్పించే టందుకు అవసరమైన చర్యలు తీసుకొన్న ట్లవుతుంది. కాని, అన్నిటికన్నా గిరిజనులే అప్రమత్తంగా ఉండి, తమ భూములు ఇతరుల చేతుల్లోకి పోకుండా చూసుకోవటం ముఖ్యమైన విషయం [డి. ఎస్. ఎఫ్.].

—నీరజ్ కె. ప్రసాద్

ఆంధ్రప్రభ దినపత్రిక జూన్ 1 1992 సౌజన్యంతో

ప్రచురణ : శక్తి, రంపచోడవరం.

ప్రకాష్ ప్రింటింగ్ వర్క్స్, అన్నపూర్ణమ్మపేట, రాజమండ్రి - 3